క్లుప్తంగా

వైద్యుడి విరాళం

భిక్కనూరు: సిద్ధరామేశ్వరాలయం అభివృద్ధికి కామారెడ్డి పట్టణానికి చెందిన వైద్యుడు రమాకాంత్ రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాత రమాకాంత్, ఆయన తల్లి దండ్రులు మీరాబాయి–డాక్టర్ రామలింగంను ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ఆలయ అభివృద్ధికి రూ.1.25 లక్షలు..

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీరామ్ రాజేశ్వర్, సురేఖ దంపతులు రూ.1.25 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఈవో ప్రభు రామ్‌చంద్రం, అర్చకులు ఉన్నారు.

ఆర్థిక సాయం

బీబీపేట: ఇటీవల మండల కేంద్రానికి చెందిన పంచాయతీ కార్మికుడు కొంగరి బాబు ఆత్మహత్య చేసుకోవడంతో ఆయన కుటుంబానికి 2008–09 పదవ తరగతి పూర్వ విద్యార్థులు రూ.20 వేలతో పాటు, నిత్యావసర సరుకులను అందజేశారు.

‘కంటి వెలుగు’ ప్రారంభం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆత్మకూర్‌లో బుధవారం ఎంపీపీ రాజ్‌దాస్ స్థానిక సర్పంచ్ బాల్‌రెడ్డితో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రమేష్‌తోపాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరమవుతుందని ఫిజియోథెరపి వైద్యులు అరుణ్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి భవిత కార్యాలయంలో ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. అంగవైకల్యం గల 8 మంది చిన్నారులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ప్రతి రోజు వ్యాయామాలు చేయించాలని చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి



కామారెడ్డి అర్బన్: ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమం నిర్వహించారు. పోటీ ప్రపంచంలో వినియోగదారులు కంపెనీలు చేసే జిమ్మిక్కులకు పట్ల అప్రమత్తంగా ఉండాలని సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సువర్ణ అన్నారు. సమావేశంలో సమాఖ్య ప్రతినిధులు ముల్కరాజు, అన్నపూర్ణ, బాల్‌రాజ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

భైరవ హోమం

రామారెడ్డి(ఎల్లారెడ్డి): కాలభైరవుడి ఇష్టమైన అష్టమి రోజున బుధవారం భైరవ హోమం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా ఇసన్నపల్లి(రామారెడ్డి)లో కొలువైన కాలభైరవుడి అష్టమి, అమావాస్య ప్రీతిపాత్రమైన రోజులని, ఆ రోజుల్లో ప్రత్యేకంగా భైరవ హోమం నిర్వహిస్తామని ఆలయ అర్చకుడు శ్రీనివాసశర్మ తెలిపారు. కార్యక్రమంలో రినోవేషన్ కమిటీ చైర్మన్ మాలతి, సురేందర్ పాల్గొన్నారు.

జీవదాన్ పాఠశాలలో వీడ్కోలు వేడుక

ఎల్లారెడ్డి: పట్టణంలోని జీవదాన్ పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని పాఠశాల హెచ్‌ఎం జోసెఫ్ ఆకాంక్షించారు.

పెరిక సంఘం జిల్లా నేతల సమావేశం



భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో పెరిక సంఘం జిల్లా నేతలు బుధవారం సమావేశమయ్యారు. జిల్లా కార్యవర్గాన్ని నూతనంగా ఎన్నుకోవాలని ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు జిల్లా పెరిక సంఘం నాయకుడు కుంచాల శేఖర్ తెలిపారు. సమావేశంలో సంఘం నేతలు మర్రి శేఖర్, కొండ్ల శివప్రసాద్, కొండ్ల భాస్కర్, పనాస అంజయ్య, దేవరగట్టు రాజు , రామేశ్వర్‌పల్లి పెరిక సంఘం అధ్యక్షుడు పనాస నాగరాజు, ఉపాధ్యక్షుడు పిన్నం రాజలింగం పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే జాజాల సురేందర్
- ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం



ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి: ప్రజల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.కోటి 50 లక్షలతో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఎల్లారెడ్డిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డయాలసిస్ కోసం బాధితులు కామారెడ్డి, నిజామాబాద్, హైదరాబాద్‌కు పోయి ఇబ్బందులు పడకుండా ఎల్లారెడ్డిలోనే డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎల్లారెడ్డిలో త్వరలోనే 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తామన్నారు. రూ.14 కోట్లతో భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాగా టెండర్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో 300 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, మరో 300 ఇళ్లను నిర్మిస్తామన్నారు. మొదటి విడతలో అర్హులైన వారికి అధికారులు లక్కీ డ్రా పద్ధతిన ఇళ్లను కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీ నారాయణ, జెడ్పీటీసీ ఉషాగౌడ్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

‘పల్లె ప్రగతి’ పకడ్బందీగా నిర్వహించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీవో శ్రీనివాస్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలో పల్లెప్రగతి పనులను పకడ్బందీగా నిర్వహించాలని నాగిరెడ్డిపేట ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. గోలిలింగాల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. దీంతో పాటు గ్రామంలో పల్లె ప్రగతి పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలో ప్రతిరోజూ చెత్త సేకరణ చేయాలని, కంపోస్ట్‌షెడ్డులో ఎరువును తయారు చేయించాలని సూచించారు. అలాగే గ్రామంలో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. సర్పంచ్ మురళి, కార్యదర్శి మహేష్ గౌడ్ ఉన్నారు.

‘హాథ్ సే హాథ్ జోడో’ జయప్రదం చేయాలి



పెద్దకొడప్‌గల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ‘హాథ్ సే హాథ్ జోడో’ పాదయాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత గంగారాం పిలుపునిచ్చారు. కార్యకర్తలతో మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయలంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి జుక్కల్ నియోజకవర్గంలోనికి 24న వస్తున్నారని నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

హడావిడిగా పరీక్షా కేంద్రాలకు..

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష జరిగింది. ఒక నిమిషం నిబంధన ఉండడంతో కొంత మంది విద్యార్థులు చివరి నిమిషంలో హడావిడిగా పరీక్షాకేంద్రానికి చేరుకున్నారు. పలువురు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో లోనికి అనుమతించలేదు. సిబ్బందిని ఎంత వేడుకున్నా కనికరించలేదు. విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా క్షుణ్ణంగా తనిఖీ లోనికి పంపారు. లింగంపేట మండల కేంద్రంలో సీఈసీ విద్యార్థి మంగళి వేణు హాల్ టికెట్ లేకుండా రావడంతో వెనక్కి పంపించారు. అనారోగ్యం కారణంగా ఫీజు చెల్లించలేదని వేణు పేర్కొన్నాడు.

– సాక్షి నెట్‌వర్క్




మద్నూర్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు.. బాన్సువాడలో పరీక్షా కేంద్రానికి పరుగులు

విద్యార్థుల శ్రమదానం



రామారెడ్డి(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మంజీర డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు బుధవారం ఇసన్నపల్లి కాలభైరవ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ గురువిందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు పచ్చదనం పరిశుభ్రత అంశాన్ని ఎంచుకొని రామారెడ్డి కాలభైరవ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రమదానం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంజీవ్, కళాశాల డైరెక్టర్ సురేష్ గౌడ్, సయీద్ బాయ్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి

మద్నూర్(జుక్కల్): మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధితో పాటు రైతుల శ్రేయస్సుకు సహకరించాలని నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ బోలేవార్ సంగమేశ్వర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీలో బుధవారం ఆయన పాలకవర్గంతో మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.40 లక్షల నిధులతో మార్కెట్ కమిటీ ఆవరణలో వ్యాపార సముదాయాల నిర్మాణం, యార్డులో రైతుల కోసం మూత్రశాలల నిర్మాణం, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు.



డ్రైనేజీ పనుల పరిశీలన

బాన్సువాడ టౌన్: పట్టణంలోని ఎల్లయ్య చెరువు కట్ట పక్కన రూ.కోటి 66 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ డ్రైనేజీ పనులను బుధవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని, చెరువు కట్టపై సీసీ రోడ్డును నిర్మించాలని అన్నారు. వీక్లీ మార్కెట్ వద్ద రజకుల కోసం దోబీఘాట్‌ను నిర్మిస్తున్నామని, దోబీఘాట్‌కు నిధులు మంజురయ్యాయని రజకులకు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఆర్డీవో రాజాగౌడ్, నాయకులు పోచారం శంభూరెడ్డి, అంజిరెడ్డి, ఎజాస్, లింగం ఉన్నారు.

భూమి విరాళమిచ్చిన దాతలకు సన్మానం

భిక్కనూరు: మండల రెడ్డి సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి రెండు ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చిన దాతలను బుధవారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన పెద్దబచ్చగారి యాదిరెడ్డి, పెద్దబచ్చగారి నరేందర్‌రెడ్డిలు తమకు సంబంధించిన 2 ఎకరాల భూమిని విరాళంగా ఇవ్వడం అభినందనీయమని మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు నాగన్నగారి నరేందర్‌రెడ్డి అన్నారు. రూ.కోటి విలువ చేసే భూమిని వారు విరాళంగా ఇవ్వడం వారి దాతృత్వానికి నిదర్శనమన్నారు. సంఘం ఉపాధ్యక్షులు పెంజర్ల బాపురెడ్డి, ప్రధాన కార్యదర్శి చెన్నప్పగారి కృష్ణారెడ్డి, పప్పుల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులు చదివించాలి

బాన్సువాడ రూరల్: తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్న కలలను నిజం చేయాలని దళిత ఐక్యవేదిక బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్ కోరారు. బుధవారం హన్మాజీపేట్‌లో ఆలిండియా అంబేడ్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుని మాట్లాడారు. దళితులు కులాల కుమ్ములాటలు మాని హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నాయకులు బంగారు మైశయ్య, మల్లూరి సాయిలు, మన్నె సాయిలు, తదితరులున్నారు.

ఊరడమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్లో బుధవారం ఊరడమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పట్టణ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఉత్సవాలను నిర్వహించారు. వేద పండితులు పూజలు చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు. మొక్కులు తీర్చుకున్నారు. బీజేపి అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. విగ్రహదాత గాండ్ల వెంకట్రాజంతో పాటు కౌన్సిలర్ అన్మండ్ల మానస తదితరులను సన్మానించారు.

ఘనంగా పూర్ణాహుతి

భిక్కనూరు: సిద్ధరామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఐదు రోజులుగా జరుగుతున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలను పూర్ణాహుతితో ముగింపు పలికారు. కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి, ఈవో శ్రీధర్, క్లర్క్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



జప్తిజాన్కంపల్లిలో పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్



లింగంపేటలో.. వైస్ ఎంపీపీ విఠల్ రెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజాన్కంపల్లిలో సీసీ రోడ్డు పనులను బుధవారం గ్రామ సర్పంచ్ దేశబోయిన సాయిలు ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ కుమార్, వార్డ్ సభ్యులు గంగాధర్, లచ్చయ్య పాల్గొన్నారు.

లింగంపేటలో రూ.20 లక్షలతో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఆరో వార్డులో బుధవారం రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులను వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సిద్దారెడ్డి, ఉప సర్పంచ్ కొడ రవి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దివిటి రమేశ్, సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డిపై ప్రత్యేక శ్రద్ధ..

రామారెడ్డి(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ మండల కేంద్రంపై ప్రత్యేక శ్రద్ధతో పనులు చేయిస్తున్నారని రామారెడ్డి సర్పంచ్ సంజీవ్ అన్నారు. బుధవారం రామారెడ్డిలో సీసీ రోడ్లకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.15 లక్షలు, డ్రైనేజీలకు రూ.4 లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణాలకు మరో రూ.6 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు కేటాయించి బుధవారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, వార్డు సభ్యులు సుంకోజి గంగాధర్, తుపాకుల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటార్ పనులు..

దోమకొండ: మండల కేంద్రంలో బుధవారం బోరుమోటార్ పనులను జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ ప్రారంభించారు. ఎస్సీ మాలవాడలో తాగునీటి సమస్య ఉండగా, జెడ్పీ నిధులతో డ్రిల్లింగ్ చేసి బోరు వేశామన్నారు. సర్పంచ్ నల్లపు అంజలి, మాజీ సర్పంచ్ ఐరేని నర్సయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు నల్లపు శ్రీనివాస్, నాయకులు దుర్గారెడ్డి, రాజిరెడ్డి, కూర చంద్రం, తదితరులు పాల్గొన్నారు.



రామారెడ్డిలో.. సర్పంచ్ సంజీవ్



దోమకొండలో.. జెడ్పీటీసీ తిర్మల్ గౌడ్

పేపర్ లీకేజీ దోషులను శిక్షించాలి



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు



బీజేవైఎం ఆధ్వర్యంలో..

కామారెడ్డి టౌన్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నేత సురేష్ మాట్లాడుతూ.. ఈ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించి, అవినీతికి పాల్పడిన అధికారులను తొలగించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్, ముఖేష్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

కామారెడ్డి టౌన్: పరీక్షా పేపర్‌ల లీకేజీపై బీజేవైఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు నంది వేణు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. పరీక్షలు కూడా పకడ్బందీగా నిర్వహించే సత్తా లేనిది బీఆర్‌ఎస్ ప్రభుత్వం అని విమర్శించారు. పరీక్షా ప్రశ్నపత్రాల లీక్‌లపై ప్రశ్నిస్తే బీజేవైఎం నాయకులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. బీజేవైఎం నాయకులు రాజేష్, సంతోష్, రాజగోపాల్, తదితరులున్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

కామారెడ్డి అర్బన్: లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి న్యాయం చేయాలని టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు డిమాండ్ చేశారు. అన్ని పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుభాష్‌రెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పర్మళ్ల తండాలో మాట్లాడారు. వందలాది మంది పార్టీలో చేరడానికి ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు. కేంద్రంలో బీజేపీ, రాష్టంలో బీఆర్‌ఎస్ నిత్యావసర సరుకుల ధరలు, ఇంధన ధరలు పెంచి ప్రజలపై పెనుభారం మోపాయన్నారు. నల్లమడుగు సురేందర్ కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల గుండెల మీద తన్ని బీఆర్‌ఎస్‌లో చేరారని గుర్తు చేశారు. అనంతరం టీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన వంద మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు.

భారీ బందోబస్తు ఏర్పాటు



పర్యవేక్షిస్తున్న డీఐజీ రమేశ్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంసాగర్(జుక్కల్): మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిజాంసాగర్ మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, నాగమడుగు ఎత్తిపోతల పథకం శంకుస్థాపన సందర్భంగా కరీంనగర్ డీఐజీ రమేష్ నాయుడు, జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి స్వయంగా బందోబస్తును పర్యవేక్షించారు. అడిషనల్ ఎస్పీ అన్యోన్య, ముగ్గురు డీఎస్పీలు, 9 మంది సీఐలు, 26 మంది ఎస్సైలు, 388 మంది పోలీసు కానిస్టేబుళ్లు బందోబస్తులో పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళులు



జిల్లా కేంద్రంలో కాన్షీరామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్/ఎల్లారెడ్డి రూరల్: బీఎస్‌పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతిని జిల్లాలో పలుచోట్ల నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కామారెడ్డి ఏరియా ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు.

సంక్షిప్తం

ఫాం పాండ్ పరిశీలన

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్‌లో ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఫాం పాండ్ పనులను ఎంపీడీవో భాను ప్రసాద్ పరిశీలించారు. ప్రతి కూలీని అడిగి సమస్యలు తెలుసుకున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని గిరిజన బాలుర పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారిణి శ్రీలేఖమందులు అందించి తగు జాగ్రత్తలు చెప్పారు. ఆమె వెంట ఏఎన్‌ఎం వెంకట లక్ష్మి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేయించుకోవాలి

కామారెడ్డి టౌన్: పట్టవాసులు తమ సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రం చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ బుధవారం తెలిపారు. గృహ యజమానులు 3 ఏళ్లకు, వాణిజ్య వినియోగదారు లు 6 నెలలకు ఒకసారి శుభ్రం చేయించుకోవాలన్నారు. మున్సిపల్ లైసెన్స్ పొందిన డిస్‌లోడింగ్ ఆపరేటర్లతో మాత్రమే క్లీన్ చేయించుకోవాలన్నారు.

నూతన వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): రైతులు వ్యవసాయంలో నూతన పద్ధతులను అవలంభించాలని రిలయన్స్ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం జంగమాయిపల్లిలో డ్రోన్ స్ప్రే విధానం పట్ల రైతులకు అవగాహన కల్పించారు.

‘సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలి’

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మంచి నీటి బోరు పాడవడంతో స్థానికులు సర్పంచ్ తిర్మల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సర్పంచ్ మంగళవారం గ్రామ పంచాయతీ సిబ్బందితో మరమ్మతులు చేయించారు. సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ సూచించారు.

నరసింహుని ఆలయంలో ఆడిట్ అధికారుల పూజలు

మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం దేవాదాయ ధర్మాదాయ రాష్ట్ర ఆడిట్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, డిప్యూటీ డైరెక్టర్ పరశురామ్ గౌడ్, జిల్లా ఆడిట్ అధికారి కిషన్ పవార్‌లు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి శాలువా కప్పి సత్కరించారు.

సిద్ధరామేశ్వరాలయంలో భజనలు

భిక్కనూరు: సిద్ధరామేశ్వరాలయంలో వర కవి సిద్ధప్ప రాజయోగి శిష్యులు, అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి 10 గంటల వరకు 24 గంటలపాటు ఏకధాటిగా భజనలు చేశారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

బాన్సువాడ రూరల్: సకాలంలో ఇంటి, కుళాయి పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఇబ్రహీంపేట్ సర్పంచ్ మాలెపు నారాయణరెడ్డి కోరారు. బుధవారం గ్రామంలో గ్రామ పంచాయితీ సిబ్బంది ఇంటింటికి తిరిగి పన్నులు వసూలు చేశారు.

పాఠశాల భవనానికి భూమి పూజ

బీబీపేట: మండలంలోని శివారు రాంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలకు ప్రభుత్వం తరఫున మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా విడుదలైన రూ.26 లక్షలతో రెండు గదుల నిర్మాణానికి బుధవారం గ్రామ సర్పంచ్ ప్రభాకర్ భూమిపూజ చేశారు. ఉపసర్పంచ్ శ్రీనివాస్, కార్యదర్శి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.